సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



అన్నదాన భవనానికి రూ.70 వేలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి తెలిదేవర శ్రీనివాస్, శక్తి శ్రీదేవి దంపతులు గురువారం రూ.70 వేల విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

దేవరపల్లి: స్థానిక షిర్డి సాయిబాబా ఆలయానికి సినిమా థియేటర్స్ అధినేత తీగెల ప్రభాకరరావు, దేవీ త్రిపుర సుందరి దంపతులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 6,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,800, మధ్య డెల్టాకు 300, పశ్చిమ డెల్టాకు 3,000 కలిపి 6,100 క్యూసెక్కుల గోదావరి నీటిని గురువారం విడుదల చేశారు. సముద్రంలోకి 12,124 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన



సంగాయగూడెంలో తుపాను బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

దేవరపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. దేవరపల్లి మండలం యర్నగూడెంలో తుపానుకు దెబ్బ తిన్న అరటి తోట, సంగాయగూడెంలో దెబ్బ తిన్న ఇళ్లను బృంద సభ్యులు మహీంద్రా చండేలియా (ఏడీ, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్), చహట్ సింగ్ (అసిస్టెంట్ కమిషనర్, రూరల్ డెవలప్‌మెంట్) పరిశీలించారు. రైతులు, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నష్టాల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి కె.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

31న ఎడ్ల పరుగు పోటీలు

రాజానగరం: ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం రంగంపేట మండలం వడిశలేరులో ఈ నెల 31న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరగనున్నాయి. సీనియర్స్ (1,600 మీటర్లు), జూనియర్స్ (1,000 మీటర్లు) విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారం అందిస్తున్నారు. విజేతలకు బుల్లెట్, ఎలక్ట్రిక్ బైక్‌లు బహుమతులుగా అందిస్తారు. వివరాలకు 90006 62999, 98481 87368 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో జిల్లా నేతలకు చోటు

సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీల్లో జిల్లా నేతలకు చోటు దక్కింది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఈ నియామకాలను ప్రకటించింది. బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మార్గాని సుశీల, రైతు విభాగం జోనల్(3) ఇన్‌చార్జిగా బూరుగుపల్లి సుబ్బారావు, వాణిజ్య విభాగం కార్యదర్శిగా వారణాసి వీర వెంకట మాణిక్య శ్రీనివాస గుప్తా, జాయింట్ సెక్రటరీలుగా పెనుగొండ కృష్ణమోహన్, బొండాడ చంద్రశేఖర్, చేనేత కమిటీ జోనల్(3) ఇన్‌చార్జిగా పెనుగొండ శ్రీనివాసరావు, సెక్రటరీలుగా ఉయ్యూరి వీర్రాజు, పప్పు సింహాచలం నియమితులయ్యారు.

పంట నష్టాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: మిచాంగ్ తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాలపై నిర్దేశిత సమయంలోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా, మండల అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించి 13,289 హెక్టర్లకు గాను ఇప్పటి వరకూ 3,400 హెక్టార్లలో ఎన్యూమరేషన్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన 10 వేల హెక్టార్లలో నష్టాల నమోదును మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, ఉద్యాన రంగానికి సంబంధించి సుమారు 1,730 హెక్టార్లకు గాను ఇప్పటి వరకూ 934 హెక్టార్లలో నష్టాల నమోదు పూర్తయ్యిందన్నారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 80 శాతం సబ్సిడీపై 160 క్వింటాళ్ల వరి, 450 క్వింటాళ్ల కంది విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల లక్ష్యం 3,463 కాగా, 4,072 సాధించామని తెలిపారు. ఈ వారంలో జిల్లాకు 3,262 లక్ష్యం ఇచ్చారని, ఆ మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 46 గ్రామాల్లో 100 శాతం ఇళ్లకు ఇంటింటికీ ట్యాప్ కనెక్షన్లు పూర్తి చేశామన్నారు. రెండో దశ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని హుండీల ఆదాయం రూ.36.44 లక్షలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి హుండీల ఆదాయం గురువారం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాపాక బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించారు. నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 14 వరకూ రూ.36,44,457 ఆదాయం లభించినట్లు ఈఓ తారకేశ్వరరావు తెలిపారు.



శబరిమలకు బయలుదేరుతున్న ప్రత్యేక బస్సులు (ఫైల్)



కొవ్వూరులో కార్గో సేవలపై ప్రచారం ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కలిసొచ్చిన కార్తికం

- ఆర్టీసీకి దండిగా ఆదాయం
- ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు
- కార్గో సేవలతోనూ భారీగా రాబడి

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు: ఆదాయం పెంచుకోవడానికి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రయాణికుల ఆసక్తికి అనుగుణంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం అనే నినాదంతో వివిధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ఈ బస్సులు నడుపుతున్నారు.

ప్రత్యేక బస్సులు నడిపారిలా..

- పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రజలు ఆలయాలతో పాటు, వన సమారాధనల కోసం వివిధ పర్యాటక స్థలాలను సందర్శించారు. దీనిని ఆదాయానికి మార్గంగా ఆర్టీసీ మలచుకుంది.
- ప్రధానంగా మన పంచారామ క్షేత్రాలు, కోనసీమలోని ఏకాదశ రుద్రుల ఆలయాలు, అన్నవరం, అంతర్వేది, అరుణాచలం, ద్వారకా తిరుమల, జి.మామిడాడ, హైదరాబాద్ హాయ్‌లాండ్, ఖమ్మం పిక్నిక్, కోనసీమ దర్శిని, కోటప్పకొండ, మన్యసీమ దర్శిని, పంచారామాలు, పూరి - కోణార్క్, శబరిమల, సీతారామదర్శిని, శ్రీశైలం, తెలంగాణ పంచారామాలు, ఉత్తరాంధ్ర దర్శిని, వైష్ణవ ఆలయాల దర్శిని వంటి పేర్లతో ప్రత్యేక బస్సులు నడిపింది.
- వివిధ పుణ్యక్షేత్రాలకు 2022లో 85 ప్రత్యేక బస్సులు నడిపి, 1,05,182 మంది ప్రయాణికులను తీసుకుని వెళ్లడం ద్వారా రూ.65,28,704 ఆదాయం సాధించింది. ఈ ఏడాది ఏకంగా 170 బస్సులు నడపడం ద్వారా 1,20,631 మంది ప్రయాణికులను పుణ్యక్షేత్రాలకు తీసుకుని వెళ్లడం ద్వారా రూ.73,21,264 ఆర్జించడం విశేషం.
- జిల్లా నుంచి సుదూరాన ఉన్న శబరిమలకు 4 బస్సులు నడపడం ద్వారా రూ.7,52,800 ఆర్జించారు.
- 'మన్యందర్శిని' పేరుతో పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్, కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, సీతపల్లి బాపనమ్మ ఆలయం, మారేడుమిల్లి, మిరియాల తోటలు, రబ్బర్ ప్లాంటేషన్లు, జలతరంగిణి, వ్యూ పాయింట్, పాములేరు వాటర్‌ఫాల్స్ వంటి ఆలయాలు, సందర్శనీయ స్థలాలకు ఒకే రోజు వెళ్లి వచ్చేవిధంగా బస్సు సర్వీసు నడిపారు.. నడుపుతున్నారు. ఈ బస్సు ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరుతోంది. వీటితో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతం అరకులోయకు కూడా ప్రత్యేక బస్సులు నడిపారు.
- గత ఏడాది ధనుర్మాసంలో తొలిసారిగా సుప్రసిద్ధ క్షేత్రాలైన భద్రాచలం, ద్వారకా తిరుమల, అన్నవరం ఒకేసారి దర్శించుకునే విధంగా బస్సు సర్వీసులు నడిపారు.
- క్రిస్మస్ సందర్భంగా 'పరిశుద్ధ పంచక్షేత్ర దర్శిని' పేరుతో మొదటిసారి గత ఏడాది కొవ్వూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. గొరిపట్నంలో నిర్మలగిరి మాత, విజయవాడ గుణదల మేరీ మాత, చెన్నై డాక్టర్ పాల్ దినకరన్ బెతస్థ మందిరం, నాగపట్నం వేళాంగిణి మాత ఆలయాలకు వెళ్లేందుకు బస్సులు నడుపుతున్నారు.



ఆర్టీసీ కార్గో బస్సు

నాలుగేళ్లుగా పెరుగుతున్న కార్గో ఆదాయం (రూ.లక్షల్లో)

డిపో	2020–21	2021–22	2022–23	2023–24 (ఇప్పటి వరకూ)
రాజమహేంద్రవరం	491.85	592.16	712.05	508.85
కొవ్వూరు	69.37	91.59	120.97	142.96
నిడదవోలు	18.79	15.72	25.46	19.58
గోకవరం	15.54	10.92	21.8	17.51
మొత్తం	595.46	710.44	880.28	688.90

కార్గో రవాణాపైనా ఫోకస్

కార్గో సేవలపై కూడా ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెట్టారు. ఈ సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో డోర్ డెలివరీ సేవలు విస్తృతం చేస్తూ అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకూ కార్గో మాసోత్సవాలు నిర్వహించింది. దీనిపై విస్తృత ప్రచారం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువగా 24 గంటల్లోనే సరకులను రవాణా చేసి, అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటోంది. కార్గో సేవల ద్వారా జిల్లాలో ఆర్టీసీ ఏటా సుమారు రూ.8 కోట్ల మేర ఆర్జిస్తోంది. ఈవిధంగా గడచిన నాలుగేళ్లలో ఏకంగా రూ.28.75 కోట్ల మేర రాబడి సమకూర్చుకుంది. మరోవైపు కార్గో సేవల ద్వారా యువతకు ఆర్టీసీ ఉపాధి కూడా కల్పిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఆదాయం సాధించేందుకు నిరుద్యోగ యువతకు ఏటీబీ కౌంటర్లు మంజూరు చేస్తున్నారు.



కార్గో డోర్ డెలివరీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఖాళీ స్థలాల లీజులో..

ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇవ్వడం ద్వారా కూడా అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని రంగంపేట, అనపర్తితో పాటు కొవ్వూరు, నిడదవోలు ఆర్టీసీ డిపోల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలకు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు. రంగంపేటలో 400, అనపర్తిలో 1,111, కొవ్వూరులో 198 చదరపు గజాల చొప్పున స్థలాలను లీజుకు ఇవ్వనున్నారు.

ప్రయాణికుల ఆసక్తికి అనుగుణంగా బస్సులు నడుపుతున్నాం



ప్రయాణికుల సంక్షేమంతో పాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. కార్తిక మాసంలో నడిపిన ప్రత్యేక బస్సులకు భక్తుల నుంచి ఆదరణ బాగుంది. గతంలో కంటే ఆదాయం కూడా పెరిగింది. ఆధ్యాత్మిక కేంద్రాలు, శబరిమలకు భక్తుల కోరిక మేరకు అన్ని రకాల బస్సులూ అద్దె ప్రాతిపదికన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. భక్తులు, పర్యాటకులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా ఎవరైనా సరే బస్సుకు సరిపడ ప్రయాణికులు ఉంటే వారు కోరిన తేదీల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. ఇప్పటికే కార్గో సేవలతో సత్ఫలితాలు వస్తున్నాయి. ప్రజలు కూడా ఆర్టీసీ సేవలపై ఆసక్తి చూపుతున్నారు.

– కె.షర్మిల అశోక, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి, రాజమహేంద్రవరం

బాలికలు చదువులో ముందుండాలి



సమ్మేటివ్-1 టాపర్లతో డీఈఓ అబ్రహాం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో చదువుకుంటే బాలికలు ఉన్నత స్థితికి వస్తారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సమ్మేటివ్-1 పరీక్షల్లో టాపర్లతో గురువారం ఆయన సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉన్నతోద్యోగాల్లో స్థిరపడి ఆర్థిక స్వాతంత్ర్యం పొందుతారని చెప్పారు. దాదాపు 25 లక్షల జనాభా ఉన్న జిల్లాకు కలెక్టర్ అయిన కె.మాధవీలత ఎందరికో ఆదర్శమని అన్నారు. పదో తరగతి సమ్మేటివ్-1 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన సీహెచ్ వెన్నెల, సాయి సమంత, షేక్ సంసున్నీసాలను ఆయన అభినందించారు. మిగిలిన విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శనివారం తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల సమ్మేటివ్-1 జవాబు పత్రాలు అందజేయాలని ఈ సందర్భంగా డీఈఓ అబ్రహాం ఆదేశించారు. టాపర్లతో సెల్ఫీలు తీసుకుని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయిని బీవీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న జేసీ తేజ్‌భరత్, ఎస్ఈ మూర్తి, ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంపై వినియోగదారుల్లో ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం ఆయన వాల్ పోస్టరల్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యుత్ పొదుపు చర్యలు తప్పనిసరిగా పాటించాలని, తద్వారా బొగ్గు, గ్యాస్, క్రూడాయిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంధన వనరులపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ చూపుతోందని చెప్పారు. సహజ వనరుల పరిరక్షణకు, గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జేసీ అన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించడం వలన సహజ వనరులను ఎక్కువ కాలం ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఈ నెల 20 వరకూ విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, ఈపీడీసీఎల్ ఈఈలు నక్కపల్లి శామ్యూల్, బి.వీరభద్రరావు, డి.శ్రీధరవర్మ, డీఈఈలు ఎస్.దేవయ్య, టి.గ్రాబియేల్ తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో రేపు మెగా జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ: వికాస, దూబచర్ల వన్ టీమ్ ఆధ్వర్యాన నల్లజర్ల మండలం దూబచర్ల ఎలైట్ జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. మేళా వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మేళాలో సుమారు 25 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ వంటి రంగాల్లో సుమారు 1,500 ఉద్యోగాల నియామకానికి ఈ మేళా నిర్వహిస్తున్నారని వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో మేళాకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ఎస్వై బాబు, వికాస మేనేజర్ గోళ్ళ రమేష్ పాల్గొన్నారు.

టార్గెట్ టాప్–10

- పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యంగా పక్కా ప్రణాళిక
- నిష్ణాతులైన 70 మంది ఉపాధ్యాయులతో తర్ఫీదు
- మొదలైన వంద రోజుల ప్రణాళిక



మండపేట మండలం వెలగతోడు హైస్కూలులో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: యువత కెరీర్‌కు తొలి మెట్టు పదో తరగతి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతిలో ఉత్తీర్ణత చాలా కీలకం. ఇప్పటికే పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకూ టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో ఇందుకు తగిన ప్రణాళికతో పని చేస్తూ టాప్-10లో నిలవాలనే లక్ష్యంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విద్యా శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు.

గడచిన నాలుగున్నరేళ్లుగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యారంగంలో మెరుగైన సంస్కరణలు చేపట్టింది. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు లేకుండా మెరుగైన విద్య సాధించడం అసాధ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మారు. దీంతో 'మన బడి.. నాడు–నేడు' పథకం కింద మూడు విడతల్లో కోట్లాది రూపాయలతో పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలూ కల్పించారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ బడులను అభివృద్ధి చేసిన ప్రభుత్వం.. ఉత్తీర్ణతకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా పక్కా ప్రణాళికను అనుసరిస్తోంది. ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో కచ్చితంగా టాప్-10లో నిలవాలనే సంకల్పంతో కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యా శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రతి విద్యార్థీ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీనిని అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం నుంచి మరింత పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు తొలి దశగా శిక్షణ కూడా ఇచ్చారు. ఏయే అంశాలపై విద్యార్థులకు ఎలా తర్ఫీదు ఇవ్వాలనే అంశంపై మెళకువలు చెప్పారు.

నాలుగు కేటగిరీలుగా..

- చదివే సామర్థ్యాన్ని బట్టి విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించనున్నారు.
- ఒక పాఠశాలలోని విద్యార్థులను ఉపాధ్యాయులకు సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు 30 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉంటే ఒక్కో ఉపాధ్యాయుడికి మూడు కేటగిరీల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులను దత్తత ఇస్తారు.
- ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయుడు రోజువారీ సాధారణంగా బోధించే పాఠాలతో పాటు వారికి దత్తత ఇచ్చిన విద్యార్థుల్లో అభ్యసనలో వెనుకబడిన వారికి ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తారు.
- నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ప్రతి రోజూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.20 గంటల వరకూ ఆరు పీరియడ్లు బోధిస్తారు.
- సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిపై వారి తల్లిదండ్రులతో దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు వారాంతంలో మాట్లాడతారు.
- బోధనతో పాటు ప్రతి రోజూ ఒక సబ్జెక్టుపై ఎ, బి గ్రేడులు, సి, డి గ్రేడులకు విడివిడిగా లఘు పరీక్షలు నిర్వహిస్తారు.
- విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రామాణికంగా తీసుకుని గ్రేడ్ల గుర్తింపు ప్రక్రియను ఈ నెల 17 నాటికి ఒక కొలిక్కి తీసుకురానున్నారు.
- ఉత్తీర్ణత 35 శాతం కంటే కొద్దిగా అంటే రెండు మూడు మార్కులు తక్కువగా వచ్చే విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు.
- 11 వారాలు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తూ రోజువారీగా ఎ, బి గ్రేడ్ల వారికి 25 మార్కులు, సి, డి గ్రేడ్ల వారికి 20 మార్కులతో వార్షిక పరీక్షల తరహా ప్రశ్నలతో పరీక్షలు నిర్వహిస్తారు.
- విద్యార్థుల నైపుణ్యానికి సాన పట్టి, వారిని మెరికల్లా తయారు చేసేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన 70 మంది ఉపాధ్యాయుల సేవలను వినియోగిస్తున్నారు.

జిల్లాల వారీగా పదో తరగతి విద్యార్థులు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	14,350	14,548	28,898
కోనసీమ	9,607	9,387	18,994
తూర్పు గోదావరి	15,412	13,885	29,297

గత విద్యా సంవత్సరం టెన్త్‌లో జిల్లాల స్థానాలు

కోనసీమ	:	11
కాకినాడ	:	19
తూర్పు గోదావరి	:	17

ఈ విద్యా సంవత్సరం ఈ మూడు జిల్లాలనూ టాప్-10లో నిలబెట్టాలన్నది లక్ష్యం.


టాప్-10లో నిలబెట్టడమే లక్ష్యం



వచ్చే మార్చిలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టాప్-10లో ఉండాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. ఫలితాలతో పాటు ప్రతి ఒక్కరూ 500 పైబడి మార్కులు సాధించేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందు కోసం ఎక్కడికక్కడ జిల్లా విద్యా శాఖ 'సెల్ఫ్' అనే ప్రోగ్రాం రూపొందించింది. దానిని అమలు చేస్తూ విద్యార్థి ప్రగతిని ప్రతి 15 రోజులకు నివేదిస్తారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది. ఈ నెల 13తో ముగిసిన సమ్మేటివ్ అసెస్మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

– నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

మంచి మార్కులకు అవకాశం



కార్పొరేట్ స్కూల్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలో ప్రణాళికలు అమలు చేసి, మార్కులు సాధించేలా ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉంది. ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధిస్తాం.

– మేకల అమృతస్వామి, శ్రీనగర్ ఉన్నత పాఠశాల, పదో తరగతి, కాకినాడ

చాలా సంతోషం



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించి, వంద రోజుల ప్రణాళిక అమలు చేయడం సంతోషంగా ఉంది. దీనివలన ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణులవడంతో పాటు అధిక మార్కులు సాధించే వీలు కలుగుతుంది. విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా తెలియజేయడం అభినందనీయం. దీనివలన మా పిల్లల చదువుపై మరింతగా శ్రద్ధ చూపడానికి మాకు ఆస్కారం ఉంటుంది.

– అంజూరి వెంకట పద్మావతి, విద్యార్థి తల్లి, కాకినాడ

పరీక్షా సమయం

- పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల
- మార్చి 1 నుంచి ఇంటర్ ఫస్టియర్, 2 నుంచి సెకండియర్ పరీక్షలు
- మార్చి 18 నుంచి పది పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 18,997 మంది పది, 27,626 మంది ఇంటర్ విద్యార్థులు


పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

రాయవరం: ఇప్పుడు జిల్లా అంతా పరీక్షల ఫీవర్ ప్రారంభమవుతోంది. ఏప్రిల్ నెలలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మార్చి నెలాఖరు లోపు పది, ఇంటర్ పరీక్షలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో జిల్లాలో చదువుతున్న పది, ఇంటర్ విద్యార్థుల్లో పరీక్షల ఫీవర్ ప్రారంభమైంది. ఇప్పటికే సెకండరీ, మాధ్యమిక విద్యాశాఖలు విద్యార్థులను పరీక్షలకు ప్రిపేర్ చేసే దిశగా సన్నద్ధం చేస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ ఈ ఏడాది జూలై నుంచే పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది.

మార్చి 1 నుంచి ఫస్టియర్, 2 నుంచి సెకండియర్

ఇంటర్మీయెట్ పరీక్షల షెడ్యూల్‌ను మాధ్యమిక విద్యాశాఖ విడుదల చేసింది. ఇంటర్ బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 1 నుంచి ఇంటర్ ఫస్టియర్, మార్చి 2వ తేదీ నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఫస్టియర్ పరీక్షలు మార్చి 19, సెకండియర్ పరీక్షలు 20తో ముగియనున్నాయి. ఇదిలా ఉంటే ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారు. సమగ్ర శిక్షా ఒకేషనల్ ట్రేడ్ ఎగ్జామినేషన్‌ను ఫిబ్రవరి 22న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తుండగా, ఇంటర్ సెకండియర్ జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనుండగా, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ఉదయం , మధ్యాహ్నం సెషన్స్‌లో నిర్వహిస్తారు. ఉదయం సెషన్ ప్రాక్టికల్స్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ ప్రాక్టికల్స్ 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు.

24,924 మంది రెగ్యులర్, 2,702 మంది ప్రైవేట్ విద్యార్థులు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 13 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలు ఆరు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 64, ఒకేషనల్ అన్ ఎయిడెడ్ కళాశాలలు 44 ఉన్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న 13,764 మంది ఫస్టియర్, 11,160 మంది సెకండియర్ విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేట్‌గా 2,702 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

మార్చి 18 నుంచి పదో తరగతికి..

జిల్లాలో 2024 మార్చి 18 నుంచి మార్చి 30వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. 18న ఫస్ట్ లాంగ్వేజ్‌తో ప్రారంభమై 30న ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపరు–2తో పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. గత విద్యా సంవత్సరం పది పరీక్షలను రోజు విడిచి రోజు నిర్వహించగా, ఈసారి వరుసగా నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లను మాత్రం వేర్వేరుగా నిర్వహించడం గమనార్హం.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో 372 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 18,994 మంది పదవ తరగతి పరీక్షల దరఖాస్తులను సమర్పించగా, 18,797 మంది పరీక్ష ఫీజును చెల్లించారు. ఇంకా 197 మంది విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది. రెగ్యులర్ విద్యార్థుల్లో 9,607 మంది బాలురు, 9,387 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంగ్లిష్ మీడియంలో 7,020 మంది బాలురు, 6,876 మంది బాలికలు, తెలుగు మీడియంలో 2,587 మంది బాలురు, 2,511 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. ప్రైవేట్‌గా 1,284 మంది బాలురు, 804 మంది బాలికలు పది పరీక్షలు రాసేందుకు ఫీజును చెల్లించారు.

పదోతరగతి పరీక్షల షెడ్యూల్

తేదీ	పరీక్ష పేపరు
మార్చి 18	ఫస్ట్ లాంగ్వేజ్
మార్చి 19	సెకండ్ లాంగ్వేజ్
మార్చి 20	ఇంగ్లిష్
మార్చి 22	గణితం
మార్చి 23	జనరల్ సైన్స్ పీఎస్
మార్చి 26	జనరల్ సైన్స్ బీఎస్
మార్చి 27	సోషల్ స్టడీస్
మార్చి 28	ఫస్ట్‌లాంగ్వేజ్ పేపరు–2 (కాంపోజిట్ కోర్స్)/ ఓఎస్ఎస్‌సీ ఇన్ లాంగ్వేజ్ పేపరు1(సంస్కృతం, అరబిక్, పర్షియన్)
మార్చి 30	ఓఎస్ఎస్‌సీ ఇన్ లాంగ్వేజ్ పేపరు2(సంస్కృతం, అరబిక్, పర్షియన్)/ ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు (థియరీ)

ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్

తేదీ	ఫస్టియర్	సెకండియర్
మార్చి 1	లాంగ్వేజ్ పేపరు1	
మార్చి 2	--	లాంగ్వేజ్ పేపరు2
మార్చి 4	ఇంగ్లిష్	
మార్చి 5		ఇంగ్లీష్
మార్చి 6	గణితం1ఎ, బోటనీ,సివిక్స్	
మార్చి 7		గణితం2బి,బోటనీ, సివిక్స్
మార్చి 9	గణితం1బి, జువాలజీ, హిస్టరీ	
మార్చి 11		గణితం2బి, జువాలజీ, హిస్టరీ
మార్చి 12	ఫిజిక్స్, ఎకనామిక్స్	
మార్చి 13		ఫిజిక్స్, ఎకనామిక్స్
మార్చి 14	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్	
మార్చి 15		కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్
మార్చి 16	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు గణితం	
మార్చి 18		పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపరు, బ్రిడ్జికోర్సుగణితం,
మార్చి 19	మోడ్రన్ లాంగ్వేజ్ జాగ్రఫీ	
మార్చి 20		మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

క్లుప్తంగా

రేపు సత్యదేవుని మెట్లోత్సవం

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని మెట్లోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. పవిత్రమైన ధనుర్మాసం ప్రారంభమయ్యే ముందురోజున సత్యదేవుని మెట్లోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ మార్గశిర శుద్ధ చవితి శనివారం రత్నగిరి కొండదిగువన తొలి పావంచా నుంచి కొండమీద శ్రీసత్యదేవుని ఆలయం వరకూ గల 450 మెట్లకు భక్తులతో పూజలు నిర్వహించే 'మెట్లోత్సవం' సాగనుంది. ఇందుకుగాను రత్నగిరి మెట్లమార్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ మెట్టుకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. శనివారం ఉదయం 8–30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మొదట రత్నగిరి నుంచి కొండ దిగువకు సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకువస్తారు. అనంతరం గ్రామంలో పల్లకీలో ఊరేగింపు నిర్వహిస్తారు. తొలిపావంచా వద్ద మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి స్వామివారి ఆలయం వరకు గల మెట్లకు భక్తులు పూజలు చేసి హారతి ఇస్తారు. ఆ మెట్ల మీద నుంచి స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెడతారు.

ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలు

17 నుంచి జనవరి 16వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తర ద్వారం ద్వారా భక్తులను స్వామిదర్శనానికి అనుమతిస్తారు.

ప్రవచనం కాలక్షేపం కోసం కాదు

'సాక్షి'తో సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ


సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రామకథ యథార్థ తత్వాన్ని తెలియచెప్పడమే లక్ష్యంగా తాను రామాయణాన్ని ప్రవచిస్తున్నానని, కాలక్షేపం కోసం కాదని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ ఉద్ఘాటించారు. రాజమహేంద్రవరంలోని హిందూ సమాజంలో రుషిపీఠం మండల దీక్షగా శ్రీరామ మహాయజ్ఞం నిర్వహిస్తోంది. 42 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో ఇరవై నాలుగు వేల శ్లోకాల రామాయణ సారాన్ని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచించి, రామభక్తులను పులకింపచేస్తున్నారు. జనవరి 23వ తేదీ వరకు రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచన మహాయజ్ఞం సాగనుంది. సీతా రామలక్ష్మణుల పాదస్పర్శతో పునీతమైన గోదావరీ తీరం రామకథా ప్రవచన, స్మరణాలతో మారు మోగుతోంది. 'రాజ'మహేంద్రి 'రామ'మహేంద్రిగా మారింది! ఈ నేపథ్యంలో 'సాక్షి'తో సామవేదం ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ఉత్తరకాండ అవాల్మీకం కాదు

లోకంలో ఉత్తరకాండ వాల్మీకి మహర్షి విరచితం కాదనే మాట గట్టిగానే వినపడుతోంది. యుద్ధకాండలో పట్టాభిషేక సర్గలో ఫలశృతి చెప్పాక, తదనంతరం కథ ఉండదని వీరి వాదన. బాలకాండలో మహర్షి స్వయంగా చెప్పారు, షట్కాండలు రచించిన అనంతరం ఉత్తరకాండ రచించినట్లు....'తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకిర్భగవాన్ ఋషి'....బాలకాండలో స్పష్టంగా చెప్పారు. రామాయణంలో 24 వేల శ్లోకాలు ఉన్నాయని అందరికీ తెలుసు. ఉత్తరకాండలోని శ్లోకాలు కలుపుకుంటేనే ఈ సంఖ్య వస్తుంది. పురాణాదులలో అవతార పురుషుల ఆవిర్భావం చెప్పినట్లు, అవతార పరిసమాప్తి కూడా చెప్పడం సంప్రదాయం. రామావతార పరిసమాప్తి ఉత్తరకాండలో చూస్తాం. రామాయణంలోని కొన్ని సందేహాలకు మనకు ఉత్తరకాండలో సమాధానాలు కనపడతాయి–ఉదాహరణకు సుందరకాండలో హనుమంతుడిని చూసిన రావణుడు వచ్చినవాడు నందీశ్వరుడా అని అనుమానపడతాడు. రావణ, నందీశ్వరుల నడుమ జరిగినది మనకు ఉత్తరకాండలోనే గోచరిస్తుంది. ఉత్తరం అనే మాటకు సమాధానం అని అర్థం చెప్పుకోవచ్చు.

నేటికీ చెదరని రామాయణ ప్రాధాన్యం

ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని విమర్శలు, దాడులు చేసినా రామాయణం ప్రాచుర్యం, ప్రాధాన్యం కోల్పోదు. త్రేతాయుగమైనా, కలియుగమైనా, ఏ యుగమైనా మానవధర్మం శాశ్వతమైనది. రాగద్వేషాలు, మానవ సంబంధాలు మారవు. మన స్వభావాలను తీర్చి దిద్దేది రామాయణం. ఈ భూమిపై చెట్లు, పర్వతాలు, నీరు ఉన్నంత కాలం రామాయణం ప్రచలితం కాక మానదు. ఇది బ్రహ్మవాక్కు.

వివాహ సమయానికి సీతాదేవి వయసు ఆరు సంవత్సరాలా?

యతి వేషంలో వచ్చిన రావణునితో సీతాదేవి వనవాసానికి వచ్చే నాటికి తన భర్త శ్రీరాముని వయసు 25 సంవత్సరాలని, తన వయసు 18 సంవత్సరాలని, అప్పటికి తాము అయోధ్యలో 12 సంవత్సరాలు మానుషభోగాలు అనుభవించామని చెబుతుంది. దీనిని బట్టి చూస్తే వివాహ సమయానికి సీతాదేవి వయసు ఆరు సంవత్సరాలని అర్థం చేసుకోవాలి. ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. వేల సంవత్సరాల ఆయుఃప్రమాణాలు గల త్రేతాయుగం నాటి ప్రజల శరీర పరిస్థితులను నేటి పరిస్థితులతో అంచనా వేయకూడదు. సీత అయోనిజ, భూతలం నుంచి ఉద్భవించినది. అప్పటికి ఆమె వయసు ఆరు సంవత్సరాలు. అయోధ్యకాండలో అత్రి మహర్షి భార్య అనసూయతో తనకు వివాహమునకు తగిన వయసు వచ్చాకనే తండ్రి జనకుడు వివాహ ప్రయత్నాలు చేసాడని చెబుతుంది.'పతి సంయోగసులభం వయో దృష్ట్వా తు మే పితా...' అన్న 118వ సర్గలోని శ్లోకమే ఇందుకు ప్రమాణం. నేటి మన శరీర తత్వాలు వేరు.

కల్పనలు వాస్తవాలను కప్పి వేస్తున్నాయా?

సీతాస్వయంవరానికి రాముడు వచ్చి శివధనుసు ఎక్కుపెట్టడం, ఆ సమయంలో రావణుడు వచ్చి భంగపడటం, లక్ష్మణరేఖ, ఊర్మిళ నిద్ర, శబరి ఎంగిలి పండ్ల నివేదన, రావణుని ఉదరంలో అమృత భాండం ఉండటం అన్నీ వాల్మీకి మహర్షి తదనంతర కవుల కల్పనలు. ఇటీవల కాలంలో అనేకమంది పెద్దలు చెబుతున్న ప్రవచనాలతో ఈ కాల్పనిక మేఘాలు తొలగిపోతున్నాయి. వాస్తవాలు వెల్లడి అవుతున్నాయి.

అరణ్యంలో భరతుడు రామునికి పాదుకలు లేకుండా చేశాడా?

భరతుడు రాముడిని వనవాసదీక్షనుంచి మరల్చడానికి వచ్చి, ఆయనకు పాదుకలు కూడా లేకుండా చేశాడని ఒక కువిమర్శ ఉన్నది. రామాయణం సరిగా చదవనివారు ఇటువంటి విమర్శలకు పాల్పడుతున్నారు. రామునికి అడవిలోనే పట్టాభిషేకం చేసి, గొప్ప ఊరేగింపుగా ఆయన్ను అయోధ్యకు తీసుకురావాలని భరతుడు భావించాడు. దీనికోసం ఛత్రం, సువర్ణతాపడం చేసిన పాదుకలు తదితర సామగ్రిని తీసుకు వెళ్లాడు. అంతే కాని, ఆయన తొడుక్కున్న పాదుకలను తీసుకోలేదు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న కళ్లేపల్లి కృష్ణ (43) అనే వ్యక్తి గురువారం టిప్పర్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మృతిచెందాడు. ఉదయం 11.30 గంటల సమయంలో పొలం వెళ్లి పనులు ముగించుకుని మోటారు సైకిల్‌పై తిరిగి వస్తున్న కృష్ణను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో కింద పడిపోయిన కృష్ణ తలపై నుంచి లారీ వెళ్లడంతో తల పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. అత్యంత భయం కరంగా జరిగిన ఈ ప్రమాదంలో కేవలం మొండెం మాత్రం మిగిలింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. కృష్ణ సోదరుడు అంజిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

వైభవంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి కుమారుని వివాహ రిసెప్షన్


నూతన దంపతులతో మంత్రి వేణుగోపాలకృష్ణ


వధూవరులను ఆశీర్వదిస్తున్న జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు, చిత్రంలో వేణుగోపాలరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతుల ద్వితీయ కుమారుడు రామ్మోహనరావు, జెమీమారోజ్ వివాహ రిసెప్షన్ బుధవారం స్థానిక జేఎన్‌రోడ్డులోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. రామ్మోహనరావు, జెమీమారోజ్ నూతన వధూవరులను ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు అధికసంఖ్యలో పాల్గొని ఆశీర్వదించారు. అతిథులను విప్పర్తి వేణుగోపాలరావు, అంజలి దంపతులు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ నిఖిల్‌కృష్ణ, దివ్య దంపతులు సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ సతీష్‌కుమార్, డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి, రాపాక వరప్రసాద్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కొండేటి చిట్టిబాబు, ఉమ్మడితూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్‌అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణకుమార్, జీవీ హర్షకుమార్, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశరావు, నల్లమిల్లి శేషారెడ్డి, పాముల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా హనుబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోన్–3 ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, హితకారిణి సమాజం చైర్మన్ మునికుమారి, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, జెడ్పీ సీఈవో ఏవీ రమణారెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు, వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

భారత్ 'విశ్వగురువు' అవుతుంది

సీటీఆర్ఐ ఆధ్వర్యాన 'నన్నయ'లో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న సంజయ్‌కుమార్ సింగ్

రాజానగరం: భారత దేశం వాణిజ్య వ్యవసాయానికి అనుకూలమైన వైవిధ్యాన్ని కలిగిందని, వాణిజ్య వ్యవసాయంలో భాగస్వామ్యం ద్వారా ప్రపంచానికి 'విశ్వగురువు'గా ఆవిర్భవించే అవకాశం భవిష్యత్తులో ఉందని ఐసీఏఆర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రి కల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ సింగ్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఐసీఏఆర్ (కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ), ఐఎస్‌టీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'పొగాకు, వాణిజ్య వ్యవసాయం కోసం సంసిద్ధత వైపు సరిహద్దులు' అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును గురువారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. భారతీయ వ్యవసాయం సాంకేతిక, శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా సంప్రదాయ వ్యవసాయం నుంచి వాణిజ్య వ్యవసాయానికి దాని నమూనాను మార్చుకోవాలని సూచించారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో పొగాకు పంట కీలకం

రాజమహేంద్రవరం సీటీఆర్ఐ డైరెక్టర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ టొబాకో సైన్స్ (ఐఎస్‌టీఎస్) అధ్యక్షుడు డాక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ విదేశీ మారక ద్రవ్యాన్ని పెంపొందించడంలో పొగాకు పంట కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. పొగాకు పంటతోపాటు ముఖ్యమైన వాణిజ్య పంటల ఉత్పత్తి, ఎగుమతులలోను మన దేశం ప్రముఖ స్థానంలో నిలిచిందన్నారు. కాగా ఉత్పాదకత, నాణ్యత, విలువల జోడింపులతో ద్వితీయ వ్యవసాయాన్ని పెంపొందించడం ద్వారా వాణిజ్య పంటల ఎగుమతులలో ప్రపంచంలో భారతదేశం తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. 75 సంవత్సరాలుగా పొగాకు రైతుల పురోభివృద్ధికి సీటీఆర్ఐ అనేక రకాల పరిశోధనలు చేస్తూ, ప్రశంసనీయమైన సేవలను అందించిందన్నారు. అభివృద్ధి పరచిన సాంకేతిక పరిజ్ఞానం పొగాకు ఉత్పత్తిని, నాణ్యతను గణనీయంగా పెంచిందన్నారు. పొగాకుతోపాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ అనే నాలుగు ముఖ్యమైన వాణిజ్య పంటలను చేర్చడం ద్వారా ప్రస్తుతం జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థగా కూడా రూపుదిద్దుకుందన్నారు. భారతీయ సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.దినేష్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ టి. జానకీరామ్, 'నన్నయ' వీసీ ఆచార్య కె.పద్మరాజు, ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ జి. కృష్ణకుమార్, ఐసీఏఆర్ – ఏటీఏఆర్ఐ జోన్ ఎక్స్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా ప్రసంగించారు.

IV

సాక్షి ఫ్యామిలీ

రాజమహేంద్రవరం

శుక్రవారం ॥ 15-12-2023

ఫ్యాషన్

సంప్రదాయ వేడుకలకు గ్రాండ్‌గా తయారవ్వాలంటే అతివలు ఎంచుకునే మొదటి ఎంపిక లంగా ఓణీ లేదా గాగ్రా చోలీ అవుతుంది. ఎంబ్రాయిడరీ లాంటి రిచ్ డిజైన్స్ లేవు అనుకునేవారు రీసెంట్‌గా ఆకట్టుకుంటున్న డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. పురాణ గాథలు, ఫ్లోరల్, గ్రామీణ వాతావరణం నింపుకున్న డిజిటల్ డిజైన్స్ రిచ్‌లుక్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి.

డిజిటల్ మెరుపులు







మెటీరియల్

సంప్రదాయ వేడుకలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ కళగా సొంతం చేసుకోవాలనుకునేవారు ఈ డిజిటల్ ప్రింట్ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో మెటీరియల్, డిజైన్ బట్టి ధరలు వేల రూపాయల నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రెడీ టు వేర్‌గానూ ఉన్న ఈ డిజైన్స్ అమ్మాయిలను, అమ్మలనూ ఆకట్టుకుంటున్నాయి.

కలంకారీ ప్రింట్స్

చందేరీ ఫ్యాబ్రిక్‌పైన పెన్ కలంకారీ మాత్రమే కాదు కలంకారీ ప్రింట్స్ కూడా కొత్త ఊపిరి పోసుకుంటున్నాయి. హ్యాండ్‌మేడ్ చేయించుకోవడానికి టైమ్ పడుతుంది అనుకునే వారు రెడీ టు వేర్‌గా ఉన్న కలంకారీ లెహంగా చోలీ డిజైన్స్‌ను ఎంచుకోవచ్చు.

పట్టుపైనా...

పట్టు లెహంగాలు ఎప్పుడూ రిచ్ లుక్‌ని ఇస్తాయి. అయితే, వీటిని మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దడానికి డిజిటల్ ప్రింట్స్ సందడి చేస్తున్నాయి. దుపట్టా, బ్లౌజ్, లెహంగా లు కొత్త లుక్‌తో మెరిసిపోతున్నాయి. సంప్రదాయ వివాహ వేడుకలు, పండుగల రోజుల్లో ఇవి కొత్త ప్రత్యేకతను నింపుకుంటున్నాయి.

వంటిల్లు

ఈ క్రిస్టమస్‌కు సులభంగా... త్వరగా చేసుకోదగిన రుచికరమైన కుకీస్ ఈ వారం

రంగు రంగుల రుచులు


క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – అర టీస్పూను; పంచదార – ఒకటిన్నర కప్పులు; బటర్ – కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు.

తయారీ: ● మైదా, వంటసోడా, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● బటర్‌లో పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు బీటర్‌తో కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను రెండు గంటలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత బటర్ క్రీమ్‌లో గుడ్లసొన, వెనీలా ఎసెన్స్, మైదా మిశ్రమం వేసి ముద్దగా కలుపుకోవాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత పిండి ముద్దను రొట్టెల్లా వత్తుకోవాలి ● ఈ రొట్టెను క్రిస్టమస్ ట్రీ, స్టార్స్, బొమ్మల ఆకారంలో కట్ చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి. కుకీస్ ఆకారాన్ని బట్టి ఫుడ్ కలర్ వేసుకోవచ్చు ● ఈ బేకింగ్ ట్రేను 400 డిగ్రీల ఫారిన్ హీట్ వద్ద పదినిమిషాలు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన క్రిస్టమస్ సాఫ్ట్ కుకీస్ రెడీ.

స్నీకర్ డూడుల్ కుకీస్



కావలసినవి: మైదా – మూడు కప్పులు; టార్టారిక్ యాసిడ్ – రెండు టీస్పూన్లు; కోషర్ సాల్ట్ – టీస్పూను; వంటసోడా – ముప్పావు టీస్పూను; బటర్ –కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; వెనీలా ఎసెన్స్– టీస్పూను; దాల్చినచెక్క పొడి – టేబుల్ స్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో మైదా, టార్టారిక్ యాసిడ్, వంటసోడా వేసి కలపాలి ● అన్నీ కలిసిన తరువాత బటర్, ఒకటింబావు కప్పుల పంచదార వేసి మెషిన్ మిక్సర్‌తో కలపాలి ● మిశ్రమం క్రీమ్‌లా మారిన తరువాత వెనీలా ఎసెన్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● మిగిలిన పంచదారలో దాల్చినచెక్క పొడి వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● గంట తర్వాత రిఫ్రిజిరేటర్‌నుంచి తీసిన మిశ్రమాన్ని రెండు టేబుల్ స్పూన్ల చొప్పున తీసుకుని బాల్స్‌లా చేసి దాల్చినచెక్క పొడి అద్ది బేకింగ్ ట్రేలో పెట్టాలి ● కుకీస్ అన్నీ తయారయ్యాక.. బేకింగ్ ట్రేని 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద, ఇరవై నిమిషాలు బేక్ చేస్తే స్నీకర్ డూడుల్ కుకీస్ రెడీ.

ఇటాలియన్ పీచ్ కుకీస్



కావలసినవి: మైదా – మూడున్నర కప్పులు; వంటసోడా – టేబుల్ స్పూను; కోషర్ సాల్ట్ – పావు టీస్పూను; బటర్ – అరకప్పు; పంచదార – రెండు కప్పులు; గుడ్లు – రెండు కప్పులు; వెనీలా ఎసెన్స్ – రెండు టీస్పూన్లు; పాలు – కప్పు; ఎరుపు, పసుపు ఫుడ్ కలర్ – నాలుగు చుక్కలు (ఒక్కోటి రెండు చుక్కలు). పీచ్ బటర్ క్రీమ్: బటర్ – పావు కప్పు; వెనీలా ఎసెన్స్ – అర టీస్పూను; కోషర్ సాల్ట్ – చిటికెడు; పంచదార పొడి – కప్పు; పీచ్ ప్యూరీ – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో వంటసోడా, ఉప్పు వేసి కలపాలి ● దీనిలో బటర్, కప్పు పంచదార వేసి క్రీమ్‌లా మారేంత వరకు హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి. తరువాత క్రీమ్‌ను పక్కన పెట్టుకోవాలి ● మిక్సర్‌ను తక్కువ స్పీడ్‌లో పెట్టి గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్ వేసి రెండు నిమిషాలు బీట్ చేసుకోవాలి ● తరువాత మైదా, బటర్ మిశ్రమం అరకప్పు పాలు పోసి అన్ని చక్కగా కలిసేంత వరకు బీట్ చేయాలి ● ఇప్పుడు ఈ మిశ్రమాన్ని స్కూప్ పరిమాణంలో తీసుకుని గుండ్రని బాల్స్‌లా చేసి పైన కొద్దిగా వత్తి పీచ్ ఫ్రూట్ ఆకారంలోకి తీసుకు రావాలి ● ఇలా అన్ని కుకీస్ రెడీ అయిన తరువాత అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేయాలి ● పీచ్ క్రీమ్‌కోసం తీసుకున్న బటర్, వెనీలా ఎసెన్స్, కోషర్ సాల్ట్ లనుగిన్నెలో వేసి హ్యాండ్ మిక్సర్‌తో కలపాలి ● ఇవన్నీ చక్కగా కలిపిన తరువాత మిక్సర్ స్పీడు తగ్గించి పంచదార పొడి, పీచ్ ప్యూరీవేసి మీడియం హై లో నిమిషం పాటు మిక్సర్‌తో కలపాలి ● మిగిలిన అరకప్పు పాలను రెండు సగాలుగా చేసి రెండు వేర్వేరు గిన్నెల్లో పోయాలి. ఒకదానిలో ఎరుపు, మరో దానిలో పసుపు ఫుడ్ కలర్ వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. మరోగిన్నెలో మిగిలిన పంచదారను పెట్టుకోవాలి ● కుకీస్ బేక్ అయిన తరువాత..వేడిగా ఉన్నప్పుడే కుకీస్ మధ్యలో చిన్న గాటు పెట్టి.. మధ్యలో పీచ్‌క్రీమ్‌ను వేసి శాండ్‌విచ్‌లా కొద్దిగా వత్తాలి ● ఇప్పుడు కుకీకి ఒకవైపు ఎరు రంగు కలపిన పాలు, మరోవైపు పసుపు రంగు కలపిన పాలు అద్దాలి. చివరిగా పంచదార అద్దితే ఇటాలియన్ పీచ్ కుకీస్ రెడీ.

గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్



కావలసినవి: వెనీలా కేక్ మిక్స్ – మూడు కప్పులు; నూనె – ముప్పావు కప్పు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – అరటీస్పూను; గ్రీన్ ఫుడ్ కలర్ – టీస్పూను(జెల్); పంచదార పొడి – ముప్పావు కప్పు; హార్ట్ షేప్ క్యాండీస్ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కేక్ మిక్స్,నూనె, గుడ్ల సొన, వెనీలా ఎసెన్స్‌ను, గ్రీన్‌ఫుడ్ కలర్‌ను ఒక గిన్నెలో వేసి ముద్దలా కలపాలి. తరువాత రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండి ముద్దను బయటకు తీసి స్కూప్ పరిమాణంలో పిండిని తీసుకుని ఉండలు చేయాలి ● ఈ ఉండలను పంచదారపొడిలో ముంచి కోటింగ్‌లా అద్దాలి ● తరువాత ఉండలను బేకింగ్ ట్రేలో పెట్టి, కుకీ షేప్ వచ్చేలా వత్తుకోవాలి ● కుకీ మధ్యలో హార్ట్ ఆకారంలో ఉన్న క్యాండీని పెట్టి బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టాలి ● 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే గ్రీన్ కేక్ మిక్స్ కుకీస్ రెడీ.


సుగర్ కుకీస్



కావలసినవి: బటర్ – పావు కప్పు; క్రీమ్ చీజ్ – పావుకప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; గుడ్లు – రెండు; వెనీలా ఎసెన్స్ – ఒకటిన్నర టీస్పూన్లు; బాదం ఎసెన్స్ – పావు టీస్పూను; మైదా – రెండున్నర కప్పులు; కార్న్‌స్టార్చ్ – టేబుల్ స్పూను; వంటసోడా – టీస్పూను; ఉప్పు – పావు టీస్పూను; ఎరుపు, పచ్చరంగు కలిపిన పంచదార –గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక పెద్దగిన్నెలో బటర్, క్రీమ్ చీజ్, పంచదార, గుడ్లు, వెనీలా, బాదం ఎసెన్స్ వేసి హ్యాండ్ మిక్సర్‌తో ఐదు నిమిషాలపాటు కలపాలి ● తరువాత మైదా, కార్న్ స్టార్చ్, వంటసోడా, ఉప్పు వేసి పిండి ముద్దలా కలపాలి ● ఈ పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత తీసి చిన్నచిన్న ఉండలుగా చేసి బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఫోర్క్ సాయంతో ఉండపైన ఇంటూ ఆకారంలో ముద్ర పడేటట్లు వత్తాలి ● ఇలా అన్నిటినీ వత్తుకున్నాక ఎరుపు, పచ్చరంగు పంచదారను ఈ కుకీస్ పైన చల్లాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేని అవెన్‌లో పెట్టి 350 డిగ్రీల ఫారిన్ హీట్స్ వద్ద పదిహేను నిమిషాలు బేక్ చేస్తే సుగర్ కుకీస్ రెడీ.

మీ బద్ధకం అమ్మకు భారమే



చలికాలం ముసుగు తన్ని పడుకుంటే
ఎంత బాగుణ్ణు.
బెడ్ దగ్గరకు పొగలు గక్కే టీ వస్తే
ఎంత బాగుణ్ణు.
టిఫిన్లూ, సూప్‌లు,
సాయంత్రం ఉడకబెట్టిన పల్లీలు...
ఎంత బాగుణ్ణు.
అన్నట్టు రగ్గులు, బొంతలు
భలే శుభ్రంగా, పొడిగా ఉండాలండోయ్.
చలికాలం ఎవరికీ పని చేయబుద్ధేయని కాలం.
కాని అమ్మకు తప్పుతుందా?
అమ్మ వెచ్చని రగ్గు కప్పుకుని టీవీ చూస్తూ
'టీ తెండి' అని అరిస్తే ఒకరోజైనా
ఇస్తారా ఎవరైనా?
చలికాలంలో ఇంటి సభ్యులు ఏం చేయాలి?

స్కూల్ టైమ్ మారదు. ఉదయం 8 లోపు బస్సొచ్చి ఆగుతుంది. పిల్లలకు బాక్స్ కట్టివ్వడమూ తప్పదు. ఏడున్నరకంతా కట్టాల్సిందే. టిఫిన్ తినిపించాల్సిందే. ఎంత చలి ఉన్నా, ఎంత మంచు కమ్ముకున్నా, ఎంత బద్ధకంగా ఉన్నా, ఎంత ముసుగుతన్ని నిద్రపోవాలని ఉన్నా అమ్మకు తప్పుతుందా? అమ్మ లేవకుండా ఉంటుందా? వంట గదిలో వెళ్లకుండా ఉంటుందా? నాన్న అర గంట లేటుగా లేవొచ్చు. వాకింగ్ ఎగ్గొట్టి అమ్మ ఇచ్చిన టీని చప్పరిస్తూ పేపర్‌ను చదువుతూ ఉండొచ్చు. కాని అమ్మ మాత్రం అదే వంట చేయాల్సిందే. రోజువారీ అంట్లు, బట్టల ఉతుకుడు చూడాల్సిందే. ఆమెకు ఇంట్లో నుంచి ఎలాంటి సాయం అందుతున్నదో ఆలోచించామా ఎప్పుడైనా?

బద్ధకమైన కాలం ఇది

చలికాలం బద్ధకం కాలం. తలుపులు కిటికీలు మూసుకుని అరచేతులు రుద్దుకుంటూ కూచోమని చెప్పే కాలం. బజ్జుంటే బాగుండు అనిపించే కాలం. అమ్మకు 'ఈ పూట ఎవరైనా వంట చేసి పెడితే బాగుండు' అనిపించినా అలా చేసేవారు ఎవరు? 'రోజూ వండుతున్నావ్ కదా ఇవాళ బజారు నుంచి వేడి ఇడ్లీ తెస్తానులే' అని బండి తాళం అందుకునే నాన్నలు ఎందరు? పాలల్లో కొన్ని చాకోస్ వేసివ్వు చాలు అనే పిల్లలు, బ్రెడ్ ఆమ్లెట్ చేసుకుని తింటాలే అనే భర్తలు ఉన్న ఇల్లు ఇల్లాలి శ్రమను గుర్తించే ఇల్లు. 'కాసేపు పడుకోలే' అని లేచి పేపర్లు లోపల పడేసి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, ఒక ప్యాకెట్ గిన్నెలో వేడి చేసి, కాఫీ కలిపి భార్యను లేపితే ఎంత బాగుంటుంది. మగవాళ్లు బట్టలు ఎలాగూ ఉతకరు. 'చెమ్మగా ఉన్నాయి' అని విసుక్కునే బదులు కనీసం ఎండ తగిలే తీగ దాకానో, డాబా మీదనో తీసుకెళ్లి ఆరేసే సాయం చేయరు. ఇలాంటి సమయంలో 'బట్టలు ఆరేయడం' అనే చిన్న పని కూడా చాలా పెద్ద సాయం కిందకు వస్తుంది.ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ టిఫిన్లు, ఇన్‌స్టంట్ టిఫిన్లు ఎన్నో మార్కెట్‌లో ఉన్నాయి. యూట్యూబ్‌లో కొడితే వందలాది వీడియోలు ఉన్నాయి. తెచ్చిపెట్టే స్విగ్గి, జొమాటోలు ఉన్నాయి. ఈ శీతాకాలంలో ఉదయపు వంట చెర నుంచి అమ్మకు ఏ విధంగా ఉపశమనం ఇవ్వొచ్చో తప్పక ఆలోచించాలి.

అమ్మకు కావాలి వెచ్చని దుస్తులు

సాధారణంగా ఇళ్లల్లో నాన్నకు హాఫ్ స్వెటర్లు ఉంటాయి. ఎప్పుడూ వేసుకునే ఉంటాడు. అమ్మకు మాత్రం ఎందుకనో స్వెటర్ ఉండదు. కొని తేవాలని ఎవరికీ అనిపించదు. చాలా ఇళ్లల్లో అమ్మలు పాతబడిన స్వెటర్లతోనే తిరుగుతూ ఉంటారు ఈ సీజన్లలో. ఒక రంగురంగుల కొత్త స్వెటర్ కొనుక్కోవాలని వారికి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నా, గృహిణి అయినా తాను కొనుక్కునే చొరవకు ఎప్పుడూ అమ్మ దూరంగానే ఉంటుంది. స్వెటర్ లేకుండానే చలికాలం గడిపేస్తుంది. ఆమెకు స్వెటర్, సాక్సులు, స్కార్ఫ్‌లు కావాలి. ఉన్నాయా గమనించండి. ఆమె అడగదు. తెచ్చి పెట్టండి. శీతాకాలంలో స్త్రీలు తమ శరీరం గురించి ఆలోచన చేస్తారు. చర్మాన్ని, శిరోజాల్ని కాపాడుకోవడానికి వారికి కొన్ని వస్తువులు అవసరం. క్రీములు, నూనెలు, సబ్బులు... ఏర్పాటు చేయాలి. చర్మ సమస్యలు కొందరిలో రావచ్చు. వాటిని చిట్కాలతో సరిపుచ్చుతూ బాధ పడాల్సిన పని లేదు. వైద్యుల దగ్గరకు వెళ్లాలి. తీసుకువెళ్లాలి. ఇక ఇంట్లో గర్భిణీ స్త్రీలు ఉంటే చలికాలం మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రోజువారీ చాకిరీ నుంచి దాదాపుగా తప్పించాలి.

ఇంట్లో పెద్దవారు ఉంటే?


అమ్మమ్మో, నానమ్మో ఇంట్లో ఉంటే వారి గురించి ఇల్లంతా మరింత శ్రద్ధ పెట్టాలి. మంచి షాల్, రగ్గు వారికి ఏర్పాటు చేయాలి. నేలకు పాదాలు తాకి జిల్లు మనకుండా ఇంట్లో తిరగడానికి మంచి స్లిప్పర్లు ఇవ్వాలి. స్లిప్పర్లలోనే తిరగమని చెప్పాలి. చలికి ఆకలి ఎక్కువ. పెద్దవారు పసిపిల్లల్లా మారి నోటికి హితంగా వేడివేడిగా అడుగుతారు. వారికి ఏదో ఒకటి చేసి పెట్టాలి. ఆ పనిలో కూడా అమ్మకు భర్త, పిల్లలు ఏదో ఒక మేరకు సాయం చేయాలి. వారికి వెచ్చని గది కేటాయించాలి. లేదా ఇంట్లోని వెచ్చని ప్రదేశమైనా.

శుభ్రత అందరిదీ

శీతాకాలం ఇల్లు మబ్బుగా ఉంటుంది. ఇటు పుల్ల అటు పెట్టబుద్ధి కాదు. కాని ప్రయత్నం చేసి ఇల్లు ప్రతి రోజూ సర్దుకునే పడుకోవాలి. హాల్లో బెడ్‌రూముల్లో కిచెన్‌లో కుటుంబ సభ్యులంతా నిద్రకు ముందు వీలైనంత శుభ్రంగా, సర్ది పడుకుంటే ఉదయాన్నే అమ్మ లేచినప్పుడు చిందరవందర లేకుండా పనిలో పడబుద్ధి అవుతుంది. పక్క బట్టలు మడవడం కూడా కొంతమంది చేయరు. అలాంటి వారిని తప్పక గాడిలో పెట్టాలి. చలికాలం అమ్మకి పని తేలిక చేద్దాం. చలికాలాన్ని ఎంజాయ్ చేసేలా చూద్దాం.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం



ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com